# కట్టమంచి రామలింగ రెడ్డి తో



రెడ్డిగారు చుట్ట నోట్లో పెట్టుకోగా మధురవాణి అగ్గిపుల్ల ముట్టించి నవ్వుతుంది

**మధురవాణి:** అడగవచ్చునా? మీరు పెళ్లి చేసుకోలేదేమి?

**సి.ఆర్.రెడ్డి:** మార్కెట్లో పాలు విరివిగా దొరుకుతూండగా నేను వేరే ఆవుని కొని మెయిన్టైన్ చేయనేల?

**మధుర:** అలా మీ పెద్దలు అనుకుని వుంటే - (నవ్వి)

**సి.ఆర్.:** నీకేమి? నా బ్రహ్మచర్యంవలన యిబ్బంది కలగలేదు గదా!

**మధుర:** కలగవచ్చు మొదటి నుంచీ దొరతనం చేసిన సంస్కారం కలవారు గనుక,

**సి.ఆర్.:** ఆఁ, గనుక ?

**మధుర:** స్వాతంత్ర్య ప్రీతి, ఔదార్యం, వ[illegible]నాభిమానాలు, ఆజ్ఞా భంగాన్ని సహించని అధికారం యివి మీవంటి రెడ్లకు సహజంగా వెన్నంటిన చిత్తప్రవృత్తులు రజోగుణం మీ మూల ప్రకృతి.

**సి.ఆర్.:** కనుక్కున్నావు గద?

**మధుర:** మహాభారతంలో మీకు ఎక్కువ యిష్టమైనది దుర్యోధన పాత్ర-

ఉక్కరి సురపతికైనను
మ్రొక్కము, నృప ధర్మమూది మొన తలబడినన్
మిక్కిలి పేరును నిట, దివి
నక్కజముగ బెంపు బడయనగుట నుపేంద్రా.

**సి.ఆర్.:** ద్రౌపది గూడ నాకిష్టమైన పాత్ర. నేనెప్పుడైనా వివాహం చేసుకుంటే ఆ వచ్చిన భార్య ద్రౌపది వంటి రాజసం గల మనిషైతే దాని ముందర నా రాజసం ఎందుకూ చెల్లక పోతుందేమోనని; మరి నేను పెండ్లే చేసుకొనక ఆ పరీక్షకు అవకాశము కలిగించలేదు.

**మధుర:** ద్రౌపదివంటి స్త్రీ ఎందుకనుకున్నారు? భానుమతి వంటి పతివ్రత రాకూడదా మిమ్మల్ని వరించి.

**సి.ఆర్.:** నేను రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారికి హితబోధ చేశాను.

**మధుర:** ఏమని?

**సి.ఆర్.:** నీవు కూడా పెండ్లి చేసుకొని భార్యా బంధంలో చిక్కుకొని స్వరూప నాశనం చేసుకోవద్దయ్యా అని.

**మధుర:** శర్మగారేమన్నారు?

**సి.ఆర్.:** మీ ఉపదేశం కాలాతీతంగా వచ్చింది. మరి మీకున్న భయమూ నాకు లేదన్నాడు.

**మధుర:** ఊహ్ ద్రౌపదితో పేచీ పడ్డారు. సరే యిది విన్నారా?

రెడ్డీ! నీ కవితా విమర్శన విధా శ్రీలే కథా క్లుప్తివే
రొడ్డైన్ మార్గము పూర్వలాక్షణికు లుద్యోగంబు సద్యోగమై
యొద్ధారించిన నీవచోలతికలం దుయ్యాల జంపాలలై
యుద్దీ నాకృతులైరి సూరన కవీంద్రోక్తి ప్రబంధాంగనల్

**సి.ఆర్.:** నాది పూర్వలాక్షణికుల మార్గం యెందుకైంది?

**మధుర:** ఏమార్గమైనా మీరు కావ్య భాష (అంటే గ్రాంథికమే) రాశారు, అవునా? లండన్ వెళ్ళొచ్చి పాశ్చాత్య దేశాలలో చదువుకుని యింటికొచ్చి గ్రాంథిక భాషలో మీ భావాలు వెల్లడించడం ఏం సబబు?

**సి.ఆర్.:** నా సాహిత్యమునకు నా తండ్రియే యధిదేవత. మాది కవిపండిత వంశము. హైగా కుప్పనయ్యంగారు మాకు గురువు. ఎనభై ఏళ్ళ వారు. ఆయన మా క్లాసుకు అత్తరు పూసుకుని వస్తే ' ఏమండీ! మీ క్లాసు ఎంత మంచి వాసనగా నున్నది' అని యొకప్పుడు నేను బొగడగా ''బాలులారా! మాతృభాష యొక్క పరిమళము సుమండీ! మీ యింగ్లీషు... పోలె దుర్గంధపూరితము కాదు'' అనే వారు. మాకు వ్యావహారికం మొదట్నుంచీ అబ్బలేదు.

**మధుర:** కుప్పనయ్యంగారంటే సర్వలక్షణ సార సంగ్రహము రాసిన వారేనా?

**సి.ఆర్.:** అవును. నీకెలా తెలుసు?

**మధుర:** గిరీశం గారు యిది చదవలేకనే ఎఫ్.ఏ. పరీక్షలో డింకీ కొట్టారట తెలుగులో. ఎప్పుడూ దీన్ని తిట్టుకుంటూ వుండేవారు కోపం పట్టలేక.

**సి.ఆర్.:** గిరీశానికెక్కడ లొంగుతుంది అది, లొంగదు గాక లొంగదు. కుప్పనయ్యంగార్లును వారి యనంతరం పండితులుగా వచ్చిన వేంకటకృష్ణమాచార్యులును నేర్పిన దానికంటె నెక్కువ నేను కాలేజీకి వెళ్ళిన తరువాత నేర్చుకోలేదు. ఆ వచ్చిన దానితోనే నా భాషా యాత్రను గడపుచున్నాను.

**మధుర:** మీకీ రామలింగారెడ్డి పేరెలా వచ్చింది?

**సి.ఆర్.:** నా ముత్తాతగారు కట్టమంచి రామలింగారెడ్డి. నా ఫాల పట్టిక యందలి యొకానొక చిహ్నము భావి పాండిత్య సూచకమని గ్రహించి కుప్పనయ్యం గార్లు నా ముత్తాత పేరు నాకిడి రట.

**మధుర:** మీ ముత్తాత గారి ప్రత్యేకత ఏవిటి?

**సి.ఆర్.:** మా ముత్తాత రామలింగారెడ్డి గారు కుప్పనయ్యంగార్లకు సంస్కృతాంధ్ర విద్యలను, గొసరుగ జ్యోతిషమును బోధించిన గురువులు.

**మధుర:** మీ తండ్రి గారో?

**పి.ఆర్.**: భారతము పునః పునః పారాయణము చేయించి నాయందు వారు సాహిత్య రసజ్ఞతను బుట్టించిరి.

నా తండ్రి సుగుణమణి ఖని
శ్రోత్రియు డురువైభవుండు సుబ్రహ్మణ్యుం
డాతత గతి, నాటిన వి
ద్యా తతుల ఫలంబు మీకు నభివేదింతున్.

**మధుర:** మీరు మొదట రాసిన కావ్యం ఏది?

**పి.ఆర్.**: తొలు దొల్త నేను రచించినది ''ముసలమ్మ మరణము''.

భారత భాగవతోజ్జ్వల
వారధి గత సార పద్య వరమణి చయమున్
హారాలు గట్టి నెవడా
సూరిని మజ్జనకు దలచి చూడుడు నన్నున్

ఒకానొక త్రిలింగ దేశీయునిచే వ్రాయబడి బ్రౌన్ దొరగారిచే బ్రకటింపబడిన 'అనంతపుర చరిత్రము' అనుగ్రంథము నుండి యిందలి కథం గైకొంటిని.

**మధుర:** ఏమా కథ? ఎవరా ముసలమ్మ?

**పి.ఆర్.**: వాగునకు అడ్డముగా వెళ్ళి నీటిలో మునిగి బలిదానము కావించిన పుణ్యస్త్రీ. ముసలమ్మ ఆమె నామధేయం. ఆమె చిన్నదే. పతితో అన్యోన్యకముగా కాపురం చేసుకొనే వనిత. ఆ వూరికి ఏటా వచ్చే ముంపునకు ముత్తైదువగా తనని బలి చేసుకున్నది.

**మధుర:** ఆ పుణ్య స్త్రీకి నా నమస్కారం. చాలా మంచి కావ్యం రాశారు. అంతకు మునుపు యిటువంటి సామాన్య స్త్రీల గురించి వారి త్యాగాల గురించి మంచితనం గురించి ఎవరూ వ్రాసి వుండరు.

**పి.ఆర్.**: 1900 సంవత్సరంలో, నా 19వ యేట, ఈ ఆధునిక పద్య కావ్యాన్ని 'ట్రాజెడీ'ని రచించాను. ఆధునిక కవిత్వానికి నాది తొలి కావ్యం అనవచ్చు. అనంతపురం దగ్గర బుక్కరాయ సముద్రం అని యిప్పటికీ వుంది. ఆ యూరి చెరువు కట్టకు ముసలమ్మ కట్ట అని పేరు. అచ్చట ఏటేట జనులందరు పొంగళ్ళు పెట్టుచు ముసలమ్మను గ్రామ దేవతగా కొలుచుచున్నారు. ఇది నేను స్త్రీల కొరకు చేశాను.

**మధుర:** ఇదేనా - మీరు స్త్రీల కొరకు యింకా ఏమైనా చేశారా?

**పి.ఆర్.**: అల్లా అడుగు చెప్తాను. 'నవయామిని' అని ఖండకృతి వెలయించాను. ఇది 1936లో-భిల్లణీయం కథ. ఎంత తెలివితక్కువ రాజైనా యువతీయువకులకు ఏకాంత సంఘటనం ఎట్టి మూఢులైన జేకూర్తురా?

**మధుర:** అవును. మూఢులు జేకూర్చరు. (నవ్వు) ప్రేమించుకోడానికి, వలపుకి రూల్సేవి టండీ రెడ్డివర్యా?

**పి.ఆర్.**: నీకేమి? అంతఃపుర కాంతలకు కొన్ని హద్దులుంటాయి. అవి మీర రాదు.

**మధుర:** ద్రౌపది రాజసానికి భయపడిన బ్రహ్మచారులు మీరు. వలపు; దాంపత్యం, ప్రేమ; యిటువంటి సంగతుల గురించి మీరు తీర్మానాలు చేస్తే నవ్వువస్తుంది.

**సి.ఆర్.:** పండితుడను, కవిని - మరియు విద్యావేత్తను. ఇంగ్లండులో చదువుకొని వచ్చిన నాకు ప్రేమను గురించి మాట్లాడటానికి అర్హతే లేదా?

**మధుర:** అది యిప్పుడు తేలదు. ఆ విషయం అలా వుంచి - గురువును శిష్యురాండ్రు మోహించటం నీచాతినీచమని మీ అభిప్రాయమా?

**సి.ఆర్.:** యామినీ బిల్హణుల చరిత్ర-అటువంటిది. నేను వ్రాసిన 'నవ యామిని'కి కొన్ని సవరణలు చేశాను.

**మధుర:** ప్రేమించుకున్న వారు 'నిగ్రహబుద్ధియు శమనశక్తియు నేమాత్రము లేనియట్లు పరస్పర వశులగుటకు బశువులా' అన్నారు మీరు. మీరెవరినీ ప్రేమించి యెరుగరు కనుక పశువులు గానక్కర లేకుండా అదృష్టవశాన తప్పించుకున్నారు.

**సి.ఆర్.:** ఔరా యేమి నీ వాక్చాతురి? నీకొక కస్సో చెప్పి రంజింప చేస్తాను. కవిత్వం మహా సాహస కార్యమని నా తండ్రికి భయం. విషగణాలుపడి యెవరికి చేటు వాటిల్లునో అని పెద్ద వెరపు. తెనుగులో నాకుండు పాటవం జూసి వీడెప్పుడు కవిత్వ రచనకు ప్రారంభించి నాశనమగునో యని దిగులు చెందేవారు. చనిపోయే దాకా యీ తుంటరి కవిత్వం మొదలు పెట్టి యిల్లు గూలుస్తాడేమోనని మా తండ్రి సంశయించేవారు.

**మధుర:** ఇల్లు కూల్చలేదు. ఇల్లాలు లేకుండా చేసుకున్నారు అయితేనేమి. యింటికి 'పద్మ ప్రభాస' అని కుప్పుసామయ్యరు మేడ్ డిఫికల్ట్ లాటి పేరు పెట్టుకున్నారు.

**సి.ఆర్.:** పద్మానికి మన సంస్కృతిలో మంచి ప్రాముఖ్యం వుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎంబ్లెం చేసినపుడు సూర్యుడు, వికసిస్తున్న అనేకదళపద్మం, ఒక చక్రం, చుట్టూ పాములు ' ఆంధ్ర విశ్వ కళాపరిషత్' అని పేరు 'తేజస్వినా వధీతవస్తు' అని వేదోక్తమైన సూక్తి ఏర్పాటు చేశాను. అదంతా చెబితే నీకిప్పుడు ఏం బోధపడుతుంది?

**మధుర:** అవును. నాలాటి వారివల్ల కంటె మీలాటి చదువుకున్న వారివల్ల యీ దేశం చాలా చెడిపోయింది.

**సి.ఆర్.:** అలా గిట్టని వారంటారు. ఆంధ్రా యూనివర్సిటీని నేను కేంబ్రిడ్జి నమూనా మీద మలిచాను. తెలుగంటే నాకిష్టమే - కాని దానికి ఎక్కువ ప్రాముఖ్యం యివ్వలేదు. ఉద్యోగాలు కూడా తెలుగువాళ్ళకు యివ్వలేదని నామీద అభియోగం వుంది. నేను ప్రతిభా వ్యుత్పత్తులలో ప్రతిభ గరీయసి అన్నాను.

**మధుర:** విశ్వనాథ సత్యనారాయణ గారిని మీ సంస్థ లోపలికి రానివ్వకుండా జాగర్త పడ్డారట, నిజమేనా?

**సి.ఆర్.:** ఇంటర్వ్యూలో ఆయన ప్రవర్తన మాకు నచ్చలేదు. మనిషి దగ్గర అణకువా విధేయతా లేవు. మీరెవరు నన్ను జడ్జి చేయడానికి అన్నట్లు ప్రవర్తిస్తే-

**,మధుర:** మీ రాయన్ను సెల్క్ట్ చెయ్యలేదు. పోండి - బతికి పోయాడు. మహాకవులు గుమాస్తాల్లా గుండాలనీ మీ మతం కాబోలు! మీకు రెడ్డి ఫీలింగ్ ఎక్కువట గదా! (నవ్వు)

**పి.ఆర్.:** స్వజాత్యభిమానం ఎవర్కైనా వుంటుంది.

**మధుర:** సహకుటుంబం యొక్క అనివార్య లక్షణం ఈర్ష్య. ఎంతపనైనా చేయిస్తుంది.

**పి.ఆర్.:** ''టైగర్ ఆఫ్ చిత్తూరు'' అని తిరువేంగడసామి నాయుడు చిత్తూరు హైస్కూలు హెడ్ మాస్టర్లందరి కంటె మిన్న. వారి యెడ మా తండ్రికి భక్తి యెక్కువ. భయమంతకంటె రెండింతలు. నాయుడుగారు సర్వం కష్టప్రతిభులు. ఇంగ్లీషునందు సంపూర్ణ పాండిత్యము; గణితశాస్త్రములో అసమాన ప్రజ్ఞ; తెనుగు, సంస్కృతము, సంగీతము, వీణ, బెత్తము సెట్లు, ఏదైనను సరే వారు పెట్టినదే బిచ్చము.

**మధుర:** ఆరు నెలల్లో ఆరేండ్ల చదువు సిద్ధం చేసే చిత్తూరి పులి అంటే వీరేనా?

**పి.ఆర్.:** అవును. వీరి యింగ్లీషు లా లైబ్రరీ అంత పుస్తక భాండాగారం చిత్తూరు బియ్యేబియల్ లు ఎవరూ సేకరించలేదు.

**మధుర:** మీ తండ్రిగారి గురించి చెప్పేది పూర్తి చేయలేదు. చిత్తూరు పులివద్ద మీ నాయనగారు మేక (నవ్వు)

**పి.ఆర్.:** మా తండ్రిగారు తొలుత పిత్రాచారమును బట్టి గుమాస్తా పనిలో దిగిరి. కొన్ని యేండ్లకు జిల్లా కోర్టు రికార్డు కీపరైరి. ఆ పనికి రాజీనామా యిచ్చి కార్వేటి నగర సంస్థానములో మేనేజరుగా జేరి అక్కడి రాజుల విపరీత రాజసం తట్టుకొనలేక దానిని వదలి ఫస్టు గ్రేడు ప్లీడరు సన్నదును సంపాదించుకొని వకీలు వృత్తి నాశ్రయించి దానికిని తనకును నసాధారణమైన కీర్తి తెచ్చిరి.

**మధుర:** మీ నాయన గారు మామిడి పళ్ళను సృష్టించే వారట గదా కొత్త రకాలు-

**పి.ఆర్.:** జడ్జీ కాలేటు దొరగారి పట్ల కృతజ్ఞతతో రెండు మామిడి రకములు ఒకటి 'కాలేటు పసందు' రెండవది 'రాబర్టు పసందు' అని పేర్లు పెట్టారు.

**మధుర:** మీ తండ్రిగారు సౌజన్యారావు పంతులుగారి వలె న్యాయవర్తనులట గదా-

**పి.ఆర్.:** కార్వేటి నగరంలో అందరి కోసం మా తండ్రి గారు సత్రం నడిపే వారు. క్లయింట్లు అక్కడ భోజనాలుచేసే వారు. రెండవది ''క్రమ వేతనము కంటె నెక్కువగా గైకొన్నచో అది బిచ్చముతో సమానము'' అనే వారు. నిజమైన వకీలు బిచ్చగాడు కాడు.

**మధుర:** మామిడి పండ్ల మీద మీ నాయనగారు అథారిటీట కదా-

**పి.ఆర్.:** మా తండ్రి గారికి దైవభక్తి యెక్కువ. దానితో పాటే ఛాందసము కూడా.

**మధుర:** చిన్నప్పుడు మేనమామల యిళ్ళవద్ద మీకు భోగంవాళ్ళు తలంటు పోసి జుట్టు దువ్వి బట్టలు తొడిగి ముద్దు చేసే వారట నిజమా?

**పి.ఆర్.:** పల్లెటూళ్ళలో ఆ భోగాలు మాకుండేవి. నేనప్పటికి చాలా చిన్నవాణ్నే.

**మధుర:** పెద్దయ్యాక కూడా అవన్నీ చేయించు కోవాలని వుందా? నేనే ఆడదాన్నయితే మీతో లేచిపోయి వుండే దాన్నని వెంకటచలం గారు మీ పర్సనాలిటీని అందాన్నీ తీవినీ పొగడుతూ ఎక్కడో ఎవరితోటో అన్నారట.

**సి.ఆర్.:** నువ్వన్నది కాంప్లిమెంటా, విమర్శా?

**మధుర:** మీరు పెళ్ళి చేసుకోలేదు కాని బ్రహ్మచారి కాదని ఆస్థానకవి సమ్మానసభలో చెళ్ళపిళ్ళవారు వేళాకోళం చేశారని విన్నాను. ఔనా?

**సి.ఆర్.:** నేను జవాబు చెప్పే ప్రశ్నా యిది? వేంకటశాస్త్రి గారికి జంట కవిత్వం అలవాటు. సమ్మానం రోజున నా అధ్యక్షోపన్యాసం సాగుతున్నంత సేపూ శాస్త్రిగారు పద్యాలు చదువుతూ ఏదో కామెంట్సు విసురుతూనే వున్నారు.

**మధుర:** ఆస్థానకవికి మేనర్సు లేదని చిరాకుపడి వుంటారు మీరు

**సి.ఆర్.:** లేదు. జంట కవిత్వం అలవాటు కదా. అది మానలేకుండా వున్నారన్నాను.

**మధుర:** మీరు మాంసాహారా? శాకాహారా?

**సి.ఆర్.:** గ్రాసను రాలనుం గలదె మాంసము ప్రాణుల మేనగాక య
మ్మేనుల నొంచునట్లు తమ మేనుల సోకిన మాత్రనెట్లగున్
దానిఁదలంపగా వలదె తానదిమానిన హింసలన్నియున్
మానవెయంచు నుత్తముఁడు మాంసము మాను దయార్ద్ర చిత్తుడై

అని భారతమున విని 'మాంసాహారము మానిన జీవహింస మాను' నని మా తండ్రి దానిని విసర్జించెను

**మధుర:** మీ గురించి అడిగితే మీరు మీ నాయనగారి గురించి చెబుతారేమి? మీకు తండ్రి అనగా వల్లమాలిన ప్రేమ, భక్తి, గౌరవం - వున్నట్లున్నది

**సి.ఆర్.:** అవును. మా తండ్రిగారు ప్రచురించిన గ్రంథములు రెండు. భారత సార రత్నావళి, భాగవత సార ముక్తావళి దాని జోలికి పోవడం ప్రమాదమని సొంత కవిత్వం చెప్పలేదు

**మధుర:** మీరు మద్రాసు క్రిస్టియన్ కాలేజి రోజులనాటి నుంచి కవిగా విమర్శకునిగా యెదగలేదని కొందరు అంటారు. దానికే మంటారు?

**సి.ఆర్.:** నాకు ఇరవై యేళ్ళు రాకుండా కళాపూర్ణోదయంపై సవిమర్శక పరిశీలనం చేశాను. ముసలమ్మ మరణం సంగతి యిది వరకే చెప్పాను ఒక అర్థ శతాబ్దం పాటు పుస్తకాలకు పరిచయాలు ఉపోద్ఘాతాలూ రాస్తూ గడిపాను అడపాదడపా కొంత కవిత్వం గిలికాను. కొన్ని వ్యాసాలు చెదురు మదురుగా రాశాను.

**మధుర:** మీవంటి పెద్ద విమర్శకుడూ కవీ యింతేనా మాకిచ్చింది?

**సి.ఆర్.:** మరి విద్యావేత్తగా, కొంతకాలం రాజకీయాలలో గడిపాను కదా. అయితే, నా జీవితం వృథా అనా నీ ఉద్దేశం?

**మధుర:** రామ రామ-మీ సామర్థ్యానికి తగ్గ వ్యుత్పత్తి లేదని అంటున్నారు విజ్ఞులు.

**సి.ఆర్.:** చదువుల సరస్వతి నా కొంప తీసింది. ఐతే నా కవిత్వ తత్వ విచారము మాటేవిటి? దాన్తోనే సాహిత్య విమర్శకు పునాదులు పడ్డాయి, కొలదిగా అభిప్రాయ భేదాలున్నా.

**మధుర:** కళాపూర్ణోదయంలో మీ నిర్ణయాలు లేదా అంచనాలు కొన్ని సత్యదూరాలని మన సాహిత్యాన్ని వేరే కళ్ళద్దాలతో కొలవగూడదని డా.జి.వి.కృష్ణారావు గారు ప్రతివిమర్శ చేశార్ట గదా-

**సి.ఆర్.:** నాకంటే నా తరువాత తరానికి విమర్శలో కొన్ని సులువులూ సుఖాలూ వుంటాయి. మన వెనుక తరంవారి కంటె మనం ముందుంటాం. మన ముందుతరం వారు మన్ని దాటి వెళ్ళి మనకు ముందుంటారు. అది సహజం.

**మధుర:** 'ఎడ్డి రెడ్డి కుల మదేమని తెలుపుదు' అన్నాడు వేమన. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారి చేత వేమన ఉపన్యాసాలు రాయించేరు. వేమన రెడ్డి అనా?

**సి.ఆర్.:** కాదు. వేమన 'నువ్వు దైవంతో ఒకడుగా ఏకం కావాలంటే ముందు మనిషితో ఏకం కావా'లన్నాడు. భగవాన్ శ్రీరామకృష్ణ కూడా 'నేను తక్కువ కులాలన్నింటి కంటె తక్కువ కులం వాడి'నని చెప్పుకున్నాడు కుల తత్వాన్ని కులాన్ని అతను ఖండించాడు. తెలివి లేనివాడు దేవుడెట్లాయెరా అని అన గలిగిన వేమన అంటే నాకు ప్రాణం.

**మధుర:** మీకు బ్రాహ్మలంటే కోపమా?

**సి.ఆర్.:** అటువంటి దేమీలేదు - బ్రాహ్మణుల అపరాధాల మీదనే నా కోపదృష్టి.

**మధుర:** మనం ఆంధ్రులం. సంస్కృతంతో ఆర్యులతో ఎక్కువ అనుబంధం పెంచుకున్నాం - దక్షిణాది తమిళ సాహిత్యంతో ఎందుకు మమేకం కాలేదు?

**సి.ఆర్.:** అదే నా చింత. తెలుగు సాహిత్యాన్ని పూర్వం బ్రాహ్మలంతా ఆక్రమించారు. డామినేట్ చేశారు. అశ్వఘోషుని బుద్ధచరిత్ర ఎలాగో వచ్చింది. వీరశైవ కవులయిన నన్నెచోడుడూ పాల్కురికి సోమనాథుడూ మరుగున పడిపోతే చూస్తూ వూరుకున్నారు. సంస్కృతం నుంచి కావ్యాలు నాటకాలు మళ్ళీమళ్ళీ తెలుగు చేశారు కాని తమిళ సాహిత్యం నుంచి 'మణిమేఖలై' అంతటి అద్భుత రసమయ కళాఖండాన్ని తెలుగువారు అందుకోలేక పోయారు. తమిళ మహాగ్రంథం పెరియపురాణాన్ని తెలుగు చేసుకోలేదు. తమిళం నుంచి మనం తీసుకొనకపోవడం గొప్ప అపరాధమే.

**మధుర:** మీరు తమిళులకి తెలుగులకూ వంతెన కట్టలేక పోయారా?

**సి.ఆర్.:** మావేపు అనగా చిత్తూరు జిల్లాలో ' ఏమిరా కంబ రామాయణము మాట్లాడు తున్నావు' అనే వాడుక వున్నది. పూతలపట్టు శ్రీరాములురెడ్డి గారు కంబరామాయణము తెలుగు చేసి తమిళులకూ మనకూ చెరగని తరగని వారధి కట్టినాడు. విపరీతమైన దీర్ఘ వర్ణనలు యిందుండేవి. కావ్యాలలో 'శిలప్పదికారము'ను మించిన కావ్యం వుండడం

అసంభవం. తెనుగులో మణిమేఖల, శిలప్పదికారానికి సమానమైన రచనలు లేవు. తేవారములు, శ్రీ ఆండాళమ్మ పాశురాలు మనకు ఆలస్యంగా వచ్చాయి.

**మధుర:** బాగుంది. తమిళ వైగర్లతో కాకుండా తమిళ సాహిత్యంతో మనం బాగా పొత్తు పెట్టుకోవాలి. రంగనాథ రామాయణాన్ని మీరే కదా వెలికి తీసింది?

**సి.ఆర్.:** రంగనాథరామాయణాన్ని పరిష్కరింపజేసి ఆంధ్ర విశ్వకళాపరిషత్తు చేత ప్రమరింప చేసాను. వేటూరి ప్రభాకరశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, గన్నవరపు సుబ్బరామయ్య, పింగళి లక్ష్మీకాంతం వంటి ధీమంతులు యీ రామాయణం మీద పని చేసారు.

**మధుర:** పింగళి కట్టమంచి వారల పీఠికల్ని ఘాటుగా రాళ్ళపల్లి వారు 'భారతి'లో విమర్శించారట గదా!

**సి.ఆర్.:** రంగనాథుడనే కృత్రిమ పురుషునికి ఈ గ్రంథ కర్తృత్వం ఆపాదించారు. గోన బుద్దారెడ్డి రచన. ఇందులో అవాల్మీకాలు చాలా వున్నాయి. ఆర్యద్రావిడ సంఘర్షణ గురించి కూడా యిందులో వుంది.

**మధుర:** మొత్తానికి ఇంగ్లండులో చదువుకుని వచ్చి కూడా మీరు కథ, నవల, ఆధునిక కవిత్వం వైపు మొహం కూడా తిప్పలేదు. వ్యావహారిక భాషా వుద్యమానికి మీ చేయూత లేనేలేదు. వేష భాషల్లో ఆధునికులుగాని మీరు గొడ్డు గ్రాంథిక వాదులూ సనాతనులే - కన్యాశుల్కం మీకు నచ్చడం గురజాడ వారి అదృష్టమే-

**సి.ఆర్.:** ఏమో కొంటి తనము?

**మధుర:** మరిచాను; మీరు 1930లో ఆంధ్రా యూనివర్సిటీ వి సి.పదవికి రాజీనామా చేసారట నిజమా! కారణము?

**సి.ఆర్.:** బ్రిటీషువారి అమానుష చర్యలకు నిరసనగా; చేసాను.

**మధుర:** మరి ఆ కుర్చీని ఎవరాక్రమించారు?

**సి.ఆర్.:** సర్వేపల్లి రాధాకృష్ణ

**మధుర:** మనదేశ ప్రెసిడెంటు రాధాకృష్ణ పండితుడా! వహ్వా!

* * *

దువ్వెనతో సి. ఆర్.రెడ్డి తల దువ్వుతూ

**మధురవాణి :** ఏమి ఘుమ ఘుమ (తల ముద్దు పెట్టుకొనును) రెడ్డిగారు మైసూరులో రసికత్వం వెళ్ళబెట్టగా - ఏదో జరిగిందట

**సి.ఆర్.:** సీతల నాతలకు చేరిస్తే ఏమి ఘుమ ఘుమలు - ఏదీ రిస్కు లేకుండా వుండదు రాజులతో స్నేహం కత్తిపై సాములాంటిది.

**మధుర:** ఆ మూర్ఖులు తెలీక ఏమన్నా చేస్తే - ఆంధ్రదేశం ప్రముఖ విద్యావేత్తను కోల్పోయేది కదా, అని నా విచారం.

**సి.ఆర్.:** ఆ విషయాలు యిప్పుడు అప్రస్తుతం.

**మధుర:** మరేది ముఖ్యం? మీలో కవిత్వం ధార చిన్నప్పుడు పొంగి పెద్దయ్యాక పాలిట్రిక్స్‌లో పడి, విద్యావేత్తగా నలిగిన మీదట యింకిపోయింది.

**పి.ఆర్.:** నాలో కవికుండవలసిన ఇన్నోసెన్స్ నశించి అలా జరిగి వుండొచ్చు.

**మధుర:** మీ మేధ మీ సృజనాత్మక శక్తిని జుర్రేసింది. మీలో అమాయకత్వమే కాదు కవులకు సహజంగా వుండే సెన్స్ ఆఫ్ వండర్ కూడా తగ్గిందా?

**పి.ఆర్.:** ఇంగ్లీషు దంచేస్తున్నావ్ ఎక్కడ పట్టావేమిటి?

**మధుర:** డిస్ట్రిక్ కలెక్టరు గారి పిల్లలకి చదువు చెప్పేముందు గిరీశంగారు నామీద ఇంగ్లీషు ప్రాక్టీసు చేసేవారు. కరటకశాస్త్రి గారివద్ద సంస్కృతం నేర్చుకున్నా. మీ వద్ద తమిళం నేర్చుకోవాలనుంది.

**పి.ఆర్.:** మైసూరు వచ్చి వుంటే నీకు అర్థశాస్త్రం బోధించి వుండే వాణ్ని. అక్కడ నేనిచ్చిన లెక్చర్లన్నీ భారత అర్థశాస్త్రము కింద సంపుటీకరించాం.

**మధుర:** నాకు అర్థంతో పనిగాని అర్థశాస్త్రంతో కాదు

**పి.ఆర్.:** నా అర్థశాస్త్రం నాటి సామాజిక సాంఘిక పరిస్థితుల మీద నేను చేసిన వ్యక్తిగత విమర్శ కూడా పురుషార్థాల్లో అర్థాన్ని తక్కువగా చూశారు మన వాళ్ళు అది నాకు గిట్టదు

**మధుర:** నాకు అసలే గిట్టదు ధన మూల మిదం జగత్ అని మనవాళ్ళేగా అన్నది.

**పి.ఆర్.:** సంపద అంతా అక్రమార్జనే అంటే నేను ఒప్పుకోను. ధనం న్యాయంగా సంపాదించి సక్రమంగా కర్చుపెట్టి అనుభవించవచ్చు

**మధుర:** ఆస్తి అనేది దోపిడీ వల్ల లభించినది అని మార్క్సిస్టులు అంటార్ట. శ్రీశ్రీ గారు చెప్తగా విన్నాను. మీరేమంటారు?

**పి.ఆర్.:** దోపిడీ వల్ల సంపద ఏర్పడుతుంది అంటే నేను ఒప్పుకుంటానా? అర్థాన్ని సాధించకుండా ధర్మాన్ని ఎలా సాధిస్తారు? నిజాయితీగా వుండి డబ్బు సంపాదించవచ్చు, కోటీశ్వరులు కాలేకపోయినా.

**మధుర:** 'నిధే చాలా సుఖము; రాముని సన్నిధి సేవ సుఖమా?' అంటారు త్యాగయ్యను తిరగేసి మీరు.

**పి.ఆర్.:** మా బాగా అన్నావు. మోక్షము, పరచింత ఎక్కువై మనజాతి నిర్వీర్యమై పోయింది చాలా మటుకు.

**మధుర:** మీకంటే ముందే గురజాడ అప్పారావుగారు అస్మద్ సృష్టికర్త 'దేశమును ప్రేమించుమన్నా' అనే ముత్యాలసరాల్లో యివన్నీ చెప్పి 'మంచిగతమున కొంచెమేనోయ్' అన్నారు.

**పి.ఆర్.:** అహో! అప్పారావు గారి లాంటి ఆధునిక దృక్పథం గల మహాపురుషుడు మా వైపు జన్మించి వుంటే.

**మధుర:** భారతాలు రామాయణాలు ప్రబంధాలు అటువంటి కవిత్వాలు రాసుకుని విగ్రహాలే పండిత కవులుగాక చలం, కుటుంబరావు, గోపీచంద్ వంటి ఆధునిక రచయితలుకూడా నిండుగా వుండేవారు.

**సి.ఆర్.:** అంటే మేమంతా వట్టి రామాయణం భారతం గాళ్ళమనా నీ చులకన.

**మధుర:** పప్పుతో బాటు చారు కూడా వున్నట్లు దానితో పాటు యిది కూడా వుండేదని నా ఆశ. మీ రెక్కడ, మీ పాండిత్యమెక్కడ? యింగ్లీషు చదువులు యింగ్లండు వెళ్ళి చదువుకున్నా, మీరు మాత్రం చెక్కు చెదరలేదు. కవిత్వతత్వ విచారం గొప్ప గ్రంథం. కాని కళా పూర్ణోదయం కావ్యానికి ప్రాముఖ్యత తెచ్చిన పేరు మీకే దక్కుతుంది.

**సి.ఆర్.:** అయినప్పటికి కళాపూర్ణోదయం షష్ఠాశ్వాసంలో 189వ పద్యం వరకు వున్నంత ప్రౌఢంగా తరువాతి భాగాలు లేవన్నాను. ఈ గ్రంథమంతటితో పూర్తిచేస్తే బావుండేదన్నాను. ఏడవ ఎనిమిదవ ఆశ్వాసాల్లో భావనా శక్తి, ప్రతిభ; బలహీనాలని నా నిర్ణయం చెప్పాను.

**మధుర:** కృష్ణారావుగారు మీతో ఏకీభవించలేదు. కవిత్వంలో రమణీయ వర్ణనలు ముఖ్యాంగాలని ప్రపంచ మంతటా విమర్శకులంతా అంగీకరించనట్టిదే. అవి షష్ఠాశ్వాసం తర్వాత వున్నవట. రెడ్డిగారూ, No Purpose will be served by viewing artistic creations with the bias of the modern age.

**సి.ఆర్.:** ఎంత మాట అన్నావు? మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారు కూడా 192వ పద్యంతో కళాపూర్ణోదయ కథ సమాప్తము - తక్కిన భాగాన్ని మధురలాలసాపరిణయం అనో కళాపూర్ణ విజయమనో పిలవవచ్చునని అభిప్రాయపడ్డారు.

**మధుర:** ముఖ్యంగా మీరు కళాపూర్ణోదయంలో ఏవి దోషాలని చెప్పారో అవి గుణాలే అవి కృష్ణారావుగారు సోపపత్తికంగా చెప్పేరు. కథా ప్రధానమయిన కావ్యంగా గాక, మహోత్తమమయిన కళాసృష్టిగా ఆ కావ్యాన్ని పరిగణిస్తే తప్ప యీ రహస్యాలు అర్థం కావు

**సి.ఆర్.:** నీవనేది.కళాపూర్ణోదయం ఉత్తరభాగాన్ని నేను సరిగా అర్థం చేసుకోలేదన్న మాట?

**మధుర:** అలా ఎందుకంటారు! మీరు పాశ్చాత్య విమర్శకుల దృష్టితో చూసి వుంటారు. అందువలన తేడా వచ్చి వుంటుంది.

**సి.ఆర్.:** అదేదో స్పష్టంగా చెప్పరాదా, వింటాను! వినదగు నెవ్వరు చెప్పిన-అన్నాడు సుమతీశతకకారుడు.

**మధుర:** సో! వినండ...పురోహితుడు కళాపూర్ణునితో మాట్లాడిన తీరు, యుద్ధ దృశ్యాలు, స్వగృహోన్ముఖులయిన సైనికుల మనఃప్రవృత్తి సూరన గారు సరసంగా వర్ణించారు. కారణం ఏదైనా స్వల్పకారణాలకే యుద్ధాలు సంభవిస్తాయి. దండయాత్రలు చేయడం రాజనీతి. రాజులు దండయాత్రలు చేయక తప్పదు. సత్త్వదాత్ముడు కళాపూర్ణునికి రాజనీతి సవినయంగా వుపదేశించుట సహజం.

**పి.ఆర్.:** మరి మధురలాలస గొడవో?

**మధుర:** మధురలాలస శిశువుగా పెక్కు కథలు చెప్పి, మణిహారం ఎప్పుడయితే రొమ్మునుంచి తప్పుకుందో అప్పుడు యేమీ కథలుగా చెప్పలేకపోతుంది.

**పి.ఆర్.:** అందుకనే ఆ భాగం బోరింగ్గా వుండి వద్దనుకున్నాను.

**మధుర:** అది మీ ఇంప్రెషన్. పాఠకుడికి తెలియాల్సిన విషయాలు వుండిపోయాయి. వాటిలో సుగ్రహుని కథ ముఖ్యం. శిశువు కథలు ఎలా చెప్పగలిగింది? చెపుతూ చెపుతూ మధ్యలో ఎందుకు ఆగిపోయింది? దీనికి కారణం ఏమిటి? మృగేంద్రవాహనాలయంలో మణికంధరుడేల తన వీణను భద్రంగా దాచాడు? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు షష్ఠాశ్వాసం తరువాతగాని లభించవు. అందుచేత యీ భాగం ప్రధాన కథలో విడరాని చిక్కని పొత్తు కలిగివుంది.

**పి.ఆర్.:** ఇదంతా నాకు తెలియలేదనా? ఈ మాత్రం గ్రహించలేని మూర్ఖుణ్ణా నేను?

**మధుర:** తమరు సరసులు సహృదయులు ఆగ్రహిస్తే తట్టుకోగలమా?

**పి.ఆర్.:** కృష్ణారావు తెలివిగా సమర్థించిన వాటివి నేను కవిత్వ మూలశక్తులు బలహీనపడ్డంగా భావించాను. దానికంత గింజుకోవాలా?

**మధుర:** ఎనిమిదవ ఆశ్వాసంలో లక్ష్మీనారాయణ సంవాదం వుంది. అది నిష్ప్రయోజనమని మీరన్నారు. కృతిపతి మెప్పుకై స్వార్థంతో రాసినదని యితరులన్నారు.

**పి.ఆర్.:** అవును. అలాగే కనపడింది.

**మధుర:** సూరన విశిష్టాద్వైత మతాన్ననుసరించి కళావిర్భావ విధానాన్ని వర్ణించాడని జి.వి.కృష్ణారావు ప్రతిపాదన. మీరు కాదన్నా-

**పి.ఆర్.:** అది కూడా ఊహేగాని వాస్తవం కాదు గదా!

**మధుర:** Whatever may be the drawbacks of ancient Telugu Poets, they can never be charged with obscurity like Spenser, Browning and others. అన్నట్లు కళాపూర్ణోదయం కథంతా వరసగా ఎక్కడా తప్పులేకుండా చెప్పిన వారికి ఏదో బహుమానం ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రకటించినట్లు విన్నాను. అది ఎవరు గెల్చుకున్నారు?

**పి.ఆర్.:** ఎవర్నూ గెలుచుకోలేదు.

**మధుర:** మరి యీ రిజర్వేషన్లు, దళితుల్ని పైకి తీసుకురావడం, కులప్రాతిపదికమీద ప్రమోషన్లు యివన్నీ ఏమిటి?

**పి.ఆర్.:** కులతత్వమే పోవాలంటుంటే మళ్ళీ అట్టడుగు కులాలు బడుగు కులాలు అంటూ లెక్కలేమిటి? నాన్సెన్స్!

**మధుర:** అలా అయితే అడుగున వున్న వాళ్ళు అడుగునే వుంటారు. మీ అగ్ర కులాల వాళ్ళు పైనెక్కి పెత్తనం చలాయిస్తూ వుంటారు శాశ్వతంగా అదెట్లా సబబు?

**సి.ఆర్.:** వెనుకబడినతనం ఒక హక్కుగా ఒక లాభసాటి వ్యవహారంగా పరిగణిస్తూంటే ఎలాగ? చదువుల్లో, ఉద్యోగాల్లో ప్రోత్సాహకాలిచ్చి సహాయం చేయాలి గాని అడుగడుగునా క్రేన్లు బిగించి మీదకు లాగకూడదు.

**మధుర:** అడుగునున్న వాళ్ళు పైకి రావడం అంటే పైనున్న వాళ్ళు అడుక్కు వెళ్ళటం కాదు గదా!

**సి.ఆర్.:** ఒక్కమారు వున్నట్లుండి పదవులూ ఉద్యోగాలూ ఆక్రమించడం వలన సాంఘిక న్యాయం జరిగినట్లు అవుతుందా? అలా ద్వేషాలు క్రోధంతో పదవులు ఆక్రమించిన వారు సాంఘిక న్యాయం సమకూర్చగలరా? ఇదంతా కొరివితో తలగోక్కున్నట్లవుతుంది చివరకు గవర్నమెంటు వలన పరిపాలన, మొత్తం సంఘం వలన సాంఘిక న్యాయం జరగాల్సివుంది. రిజర్వేషన్ల కోటాలతో సమసమాజం ఏర్పడుతుందా? కల్ల!

**మధుర :** మన హిందూ సమాజం పతన మవడానికి, యూరోపియన్ సమాజంతో పోల్చిచూస్తే అభివృద్ధి చెందకపోవడానికి మీరు చెప్పే కారణాలు వినవచ్చా?

**సి.ఆర్.:** ఒకే కులంలో గాని ఒకే తెగ శాఖలోకాని పెండ్లిళ్ళు జరగడం వలన ఆ జాతి దుర్బలం అవుతుంది మచ్చుకి మన మేనరికాలు - నిజంగా నిషేధించాలి. భిన్న భిన్న కులాల మధ్య జాతుల మధ్య వివాహాల్లో లాభాలు చాలా వున్నాయి. తరవాత బాల్య వివాహాలు జరపకూడదు ఇందువలన బాలవితంతువులు పుట్టుకొస్తున్నారు.

**మధుర:** అన్నిటికంటే ప్రమాదకరం, మన ఐక్యతకు భంగకరం మన తగూలన్నిటికీ మూల కారణం హిందూ సమాజం కులాలుగా విభజింపబడటం అంటాన్నేను కులవృత్తులు నాశన మయ్యాయి గాని కులాలలాగే వుండిపోయాయి

**సి.ఆర్.:** అసలు మనవాళ్ళకు పనిచేసి బతకడం మీద చిన్న చూపు. 'కర్మ, కర్మ' అనుకోవడం మరోటి సాంఘిక దుబారాలు-అందులో ముఖ్యమైనది, సమిష్టి కుటుంబం ఒకడు సంపాదించటం పదిమంది తింటూకూర్చోడం! జాయింట్ ఫామిలీ విధానంలో కొన్ని రక్షణలు ఇమిడి వుండడం జబ్బు అసమర్థత వంటి వాటికి ఒక కాపులాగ పనిచేస్తుంది ఐనప్పటికీ పనిచేయని వాళ్ళు పదిమంది - ఎలా బాగుపడుతుంది మన సమాజం?

**మధుర:** మన సమాజంలో మరో దుర్గుణం వుంది, యాచన! భిక్షుక వృత్తి మీద కొన్ని కులాలకు కులాలే పనిచేయకుండా బతికేస్తున్నాయ్.

**సి.ఆర్.:** దానం అనే దానిని పొగిడి పెద్ద సుగుణం చేశారు మనవాళ్ళు. ఇతరుల శ్రమమీద పడి బతకడం అదో వర్చ్యూ అయింది. శంకరుడే ఆది భిక్షువు.

**మధుర:** ఈ సాంఘిక రుగ్మతలకి మీరేమి ఔషధం సూచించారు?

**సి.ఆర్.:** మూడు చెప్పాను. అన్ని రంగాలలోను ప్రముఖంగా వ్యక్తులు ఉత్సాహంగా వ్యాపారాలు

నడపాలి. సంస్థల్ని నిర్వహించాలి. పెద్ద ఎత్తున పరిశ్రమలు దేశమంతటా నెలకొల్పాలి. సహకార సంఘాల ద్వారా ఉత్పత్తుల్ని సాగించి పంపిణీ నిర్వహించాలి.

**మధుర:** ఇవి అన్నీ కూడా యిప్పుడు 'ప్లాను' ల ద్వారా మనవాళ్ళు చేశారు, చేస్తున్నారు. కాని, రాజకీయాల్లో కులాల్ని మతాల్ని వాడుకోవడం వలన, రవుడీయిజం గుండాయిజం అంతా చేరదీయడం వలన, పరిస్థితుల తారుమారయాయి. దీనికంతటికీ ఎలక్షన్లే కారణమా?

**పి.ఆర్. :** గుడ్! యీనాటి పరిస్థితుల్ని బాగా చెప్పావు. హాస్య రచయితకీ వ్యంగ్య రచయితలకీ ముడి వస్తువుగా వుపయోగించే పరిస్థితుల్లోకి నెట్టారు రాజకీయ నాయకులు మన సంఘాన్ని.

**మధుర:** నన్నయ్యగారి వచనాన్నీ చిన్నయసూరి వచనాన్నీ మెచ్చుకున్న మీరు కనీసం మాలపల్లి చదవలేదు, వేయిపడగలు చదివారో లేదో తెలీదు. కుటుంబరావు,. గోపీచంద్, చలం మీ కంటికే ఆనరు. మీరేమి సాహిత్యకారులండీ,- చెళ్ళపిళ్ళ వారి కున్న లిబరల్ దృక్పథం కూడా మీకున్నట్లు కనపడదు.

**పి.ఆర్.:** నేను పాత కొత్తల మేలు కలయిక కాలేక పోయాననా నీ ఝూడింపు? నా పుట్టుక, పెంపకం, నాచుట్టూ వున్న వాతావరణం నా విద్యాభ్యాసం-అల్లాటివి. మనవాళ్ళు పురాణ పురుషుల కిచ్చినంత గౌరవం గుర్తింపు చారిత్రక వ్యక్తులకి యిచ్చేవారు కాదు. గతం మీద గౌరవం మంచిదే - అందులోనే కూరుకుపోకూడదు.

**మధుర:** గతమంతా తడిసె నెత్తురున, కాకుంటే కన్నీళ్ళతో- అన్నాడు యుగకవి. అన్నట్లు శ్రీ శ్రీ అనే కవిని గూర్చి విన్నారా మీరు? పింగళి సూరన, నన్నెచోడుడు దగ్గరే ఆగిపోయారా?

**పి.ఆర్.:** శ్రీశ్రీ అంటే 1910లో హైలీ తోకచుక్క వచ్చినపుడు పుట్టాడ్ట,! వాడా? నా కంటికి ఆనడు. అవునూ, పింగళి సూరన, నన్నెచోడుడు అంటూ వేళాకోళంగా మాట్లాడుతున్నావు; ఏమిటి నీ ఉద్దేశం?

**మధుర:** నాకు వారి పట్ల భక్తి గౌరవాలు లేక కాదు. ఇంగ్లండు వెళ్ళొచ్చి విక్టోరియా - ఎడ్వర్డ్ కాలంలో వున్న విలువల్లో మిమ్మల్ని చూస్తే నవ్వు ఆగక - బోల్షివిక్ విప్లవానికి లీసిజ్ ఫరీకి ముందుండి పోయారు. రినైజాన్స్, ఇండస్ట్రియల్ రివల్యూషన్ వలన కలిగిన మార్పులు మీకు తెలియవా? ఆ వాసనే మీలో లేదే.

**పి.ఆర్.:** పెద్ద ఇంగ్లండు వెళ్ళొచ్చినట్లు, నన్నే నీవు నిలదీస్తున్నావే-?

**మధుర:** విబుధజనుల వలన విన్నంత కన్నంత.

**పి.ఆర్.:** మాది స్వచ్ఛమైన రెడ్డి వంశము. రాజసం మారక్తంలో వుంది. రాజ్యాలు ఏలే హక్కు వుంది. నీవో విజయనగరంలో గడవక రావప్పంతులుతో కృష్ణరాయపురం అగ్రహారానికి మకాం మార్చిన దేవదాసివి. సిద్ధాంతి, గురయసెట్టి, హెడ్ కానిస్టేబులు వీరందరితో పేకాడే దానివి. నాకు కోపం వస్తే నీ ఇంటర్వ్యూ కాన్సిల్ చేస్తాను జాగ్రత్త!

**మధుర:** చేయలేరు. చెయ్యరు.

**పి.ఆర్.:** ఎందుచేత?

**మధుర:** నేను తప్ప యిప్పుడు మిమ్మల్ని తల్చుకునే వాళ్ళే లేరు (నవ్వు) .... ఏం, తగ్గారూ, అధికారాంత స్పృహా?

**సి.ఆర్.:** కాదు. నీ మత్తు కలిగించే నవ్వు చూచి తగ్గాను కానీ, నీ శృంగార లాస్యహాసం ఏంటటా?

**మధుర:** హాఁ, మీ మధ్య పాపిడి, వుంగరాల జుత్తు, సొగసైన మీసకట్టు చూసి, చలించానను కుంటున్నారా?

**సి.ఆర్.:** నా పర్సనాలిటీ నిన్ను ఆకట్టుకోబట్టే నువ్విన్ని చమత్కారపు మాటలాడుతున్నావు; సరసాలాడుతున్నావు.

**మధుర:** జీవించడం ఒక కళ అంటారు గదా - అలా కళాత్మకంగా జీవించాలంటే మీరిచ్చే సూచన లేమిటి?

**సి.ఆర్.:** అలా జీవించాలని ఎవరూ కోరుకోరు ఒక వేళ కోరుకుంటే - ప్రకృతి నియమాలు బాగా వంట పట్టించుకోవాలి. ప్రకృతి నియమాల్ని ఆచరించడం ఎలాగో తెలియాలి తరువాత విచక్షణా జ్ఞానం అనేది వుండాలి. దేనికది ఏమిటో తెలుసుకోగల హేతువాత దృక్పధం వుండాలి దాన్తోపాటే న్యాయ నిర్ణయం చేయగల శక్తి వుండాలి అన్నిటికంటె అవసరమైతే శారీరక శ్రమ చేయకలిగి వుండాలి కూడా

**మధుర:** మరి మన పెద్ద చదువు లెలా వున్నాయంటారు?

**సి.ఆర్.:** మన యూనివర్సిటీలు మన గతకాలపు శోభని కీర్తించేవిగా మిగిలిపోయాయి

**మధుర:** అంటే పాత గొప్పలు తవ్వుకుంటూ-

**సి.ఆర్.:** అవును జ్ఞానం, జ్ఞానార్జనా ముఖ్యమే మిగతా విలువల్ని నిర్లక్ష్యం చేస్తున్నాయ్ యూనివర్సిటీలు -

**మధుర:** గతం పట్ల కృతజ్ఞతా భావంతో వున్నంత మాత్రాన అభ్యుదయం లభిస్తుందా? వర్తమానం జీవించాలి గాని గతంలో కాదు

**సి.ఆర్.:** యూనివర్సిటీ విద్యా విధానాన్ని మార్చాలి జ్ఞానంతో పాటు నైతిక విలువలను పెంచాలి

**మధుర:** మీరు ఘోటక బ్రహ్మచారి అయినా, పెళ్ళిళ్ళ గురించి మీరేం చెబుతారో వినాలని వుంది (నవ్వు)

**సి.ఆర్.:** కావ్యాలు చదివి ఆలోచించా స్వయంవరం కూడా ఒక విధమైన రాక్షస వివాహమేనని నాకనిపిస్తుంది

**మధుర:** స్వయంవరం రాక్షసమేమిటి? రాజకుమార్తె తనకు నచ్చిన వరుడి మెడలో వరమాల వేస్తుంది గదా!

**సి.ఆర్.:** అది కాదు ఎక్కడయితే శివధనుస్సు నెత్తడం, మత్స్య యంత్రాన్ని కొట్టడం

యిల్లాటి పందేలు వుంటాయో అక్కడ పెళ్ళికూతురుకి స్వేచ్ఛ ఏది? పెళ్ళికూతురుకి నచ్చిన వాళ్ళే పోటీలో పాల్గొంటారని నమ్మకం లేదు కదా! తిరస్కరించడానికి వధువుకి హక్కులేదు.

**మధుర:** దమయంతి స్వయంవరంలో ఆమె నలుణ్ణి వలచింది గదా - అక్కడ స్వయంవరం నిజంగా వధువు అభీష్టప్రకారం జరిగినట్లే కదా!

**సి.ఆర్.:** భీష్ముడు కాశీరాజు కుమార్తెలను ముగ్గురిని చెరబట్టలేదా, విచిత్రవీర్యుని కోసం? సీత, ద్రౌపది జూదంలో పావులలాంటి వారు కాలేదా? రాక్షస వివాహ పద్ధతి కాలక్రమాన అంతరించింది దాని ప్రయోజనాలు దానికున్నాయి అనుకో

**మధుర:** గాంధర్వవిధి గురించి మీరేమంటారు?

**సి.ఆర్.:** ఈ మంత్ర తంత్రాల వైదిక వివాహ విధులన్నిటికంటె చాలా ప్రాచీనమైనది గాంధర్వం స్త్రీ పురుషుల సహజ ప్రకృతులకు అనుగుణమైనది ఉత్తమమైన ప్రేమకు ఉన్నతమైన కలయిక గాంధర్వం

**మధుర:** మన దేవాలయల్లో మొక్కుల ముడుపులు గురించి మీ అభిప్రాయం?

**సి.ఆర్.:** పూజారిని మధ్యవర్తిని చేసి భగవంతుడు అనగా సృష్టికర్తతో బేరాలాడ్డం నాకు గిట్టదు

**మధుర:** మీరు ప్రబంధాల్ని చెడతిట్టారు కదా, అన్నీ పనికి మాలినవేనా మీ దృష్టిలో?

**సి.ఆర్.:** రామ, రామ! అన్నీ రొటీన్ కావు అల్లసాని పెద్దనగారి 'మనుచరిత్ర' రామరాజ భూషణుడి 'వసుచరిత్ర', చేమకూర వేంకటకవి 'విజయవిలాసం' పింగళి సూరనగారి 'కళా పూర్ణోదయం', వారిదే 'ప్రభావతీ ప్రద్యుమ్నం' - యివన్నీ మంచివి, గొప్పవి, నాకు నచ్చినవి

**మధుర:** భావ కవితా వుద్యమంలో మీ వైపునుంచి ఒక్కరంటే ఒక్కరు కూడా లేకపోవడం అది సీమ అదృష్టంగా చెప్పాలా? దురదృష్టంగా చెప్పాలా?

**సి.ఆర్.:** నా తరవాతి వాళ్ళు నా కంటె బెటరనుకుంటా నేనే అందుకోజాలనివి వాళ్లెలా అందుకుంటారు? కొన్ని మొట్టమొదటి పత్రికలు మా వేపునించే పుట్టాయి తెలుసా?

**మధుర:** మీరు గొప్ప కవి కాలేదు కాని గొప్ప సాహిత్య విమర్శకుడిగా, మంచి విద్యావేత్తగా మిగిలిపోయారు

**సి.ఆర్.:** నీకు ఎవరెక్కువిష్టం?

**మధుర:** ఫోండి! పోకిరీ మాటలూ - మీరూనూ బిల్హణీయం మీరు రాసిన దాంట్లో బిల్హణుడు పశ్చాత్తాపపడి తన్ని తాను సవరించుకున్నట్లు రాశారు, వ్యక్తిగతంగా బిల్హణుడు యామినీపూర్ణ తిలకని ప్రేమించడం భరించలేక.

**సి.ఆర్.:** ప్రేమవల నుంచి బయట పడేసినందుకు ఆమె కృతజ్ఞతగా వున్నట్లు రాశాను

**మధుర:** కృతజ్ఞత కాదు, ఏమీ కాదు! యామిని మిమ్మల్ని తిట్టి వుంటుంది గురుశిష్య సంబంధం కన్నా ఎన్నో రెట్లు బలమైనది ప్రేమబంధం మీకు స్త్రీ ప్రేమని గ్రహించడం కూడా తెలవదు మీరేం భావుకులండీ?

**సి.ఆర్.:** నువ్వు మరోలా అనుకోవని నాకు తెలుసు నైతిక ప్రమాణాలపట్ల నీకు లెక్క వుండదు.

**మధుర:** రహస్య ప్రణయాలు సాగిస్తూ దొంగముద్దులూ దొంగకవుగిలింతలూ జుర్రుకుంటూ, దాంపత్యంలో నైతిక ప్రమాణాల గురించి మీరు మాట్లాడటం

**సి.ఆర్.:** కోపం వచ్చి మాట్లాడుతూంటే నీ ముక్కు అదురుతూ కళ్ళుమెరుస్తూ, నడుం కదుల్తూ, ముందుకు రావటానికి పులిలా ఎదురుగుండెలతో నువ్వు మనోహరంగా వుంటావు రెచ్చినపుడు మరీనీ; అవునా?

**మధుర:** ఆపండి మీ పొగడ్తలు మీరు వైస్ ఛాన్సెలర్ గానే బావుంటారు ఇంకేదీ మీకు నప్పదు మీగురించి రాచమల్లు రామచంద్రారెడ్డి గారు ఏమన్నారో తెలుసా?

**సి.ఆర్.:** ఏమన్నారు?

**మధుర:** ''కట్టమంచివారు ప్రబంధ కవిత్వాన్ని అంతగా చెడతిట్టిపోసినా, తెలుగుకవిత్వానికి ఒక దారీ తెన్నూ చూపించలేకపోయారు తెలుగుకవిత్వానికి ఆయన చేసిన Positive contribution యేమీ లేదు ప్రబంధ కవిత్వం 19వ శతాబ్దిలోనే చచ్చింది ఆ శవానికి అంత్యక్రియలు చేసిన ఘనత మాత్రం శ్రీ రామలింగారెడ్డికి దక్కింది ఆ తర్వాత వచ్చిన భావ కవిత్వం దశ ఆయన ఊహకే తట్టలేదు నిజానికి చారిత్రాత్మకంగా ఆయనది ముందు చూపు కాదు'' రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు కూడా యీ పంథాలోనే అన్నారు

**సి.ఆర్.:** విద్యారంగంలో రాణించాను కానా? ఆంధ్ర విశ్వవిద్యాలయం నా కృషికి చాలదా? చరిత్రలో మైలురాయి కదా!

**మధుర:** ఆశించినది ఎంతో వుండగా లభించినది స్వల్పం అసాధారణ ప్రజ్ఞావంతులయి, ఎంతో సామర్థ్యంకల మీరు, జీవితంలో సాధించినది చాలా తక్కువ - మీ గురించి చాలామంది అభిప్రాయం యిదే It is hard to find a life so rich in promise and so poor in performance, so full of aspiration and so little of achievement

**సి.ఆర్.:** నీ బట్లరు ఇంగ్లీషు ఆపు

★

*('మిసిమి' జూలై, ఆగష్టు, 1992)*